ఉండ్రుగొండలో లక్ష్మీనరసింహుడి కల్యాణం

స్వామివారి స్వాతి నక్షత్ర కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చివ్వెంల, ఆగస్టు 11: మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గంలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి శ్రావణ మాస స్వాతి నక్షత్ర కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రవికుమారాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు హైదరాబాద్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పశువుల్లో కృత్రిమ గర్భ ధారణపై అవగాహన కల్పించాలి

- రాష్ట్ర గొర్రెలు, మేకల సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారాయుడు

పశువైద్యాధికారికి సూచనలిస్తున్న డాక్టర్ సుబ్బారాయుడు

కోదాడ రూరల్, ఆగస్టు 11: పశువుల్లో కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడదూడలకు మాత్రమే జన్మనిచ్చేలా పశువుల వీర్య నాళికల వాడకంపై పశుపోషకులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర గొర్రెలు, మేకల సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారాయుడు సూచించారు. ఆదివారం పట్టణంలోని డివిజన్ పశువైద్యశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధానం ద్వారా పశువుల మందలో ఆడ దూడలు అధికమై పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పశువైద్యాధికారులు పవు పెంపకం దారులకు అవగాహన కల్పించి ఈ విధానాన్ని పాటించేలా చూడాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటారు. ఆయన వెంట ప్రాంతీయ అసిస్టెంట్ డైరెక్టర్ పి.పెంటయ్య, పశువైద్యాధికారి రమేష్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

భూమికోసం తల్లిదండ్రులపై దాడి

- గొడ్డలితో దాడి చేసిన కూతురు, అల్లుడు, మనవడు

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 11 : తల్లిదండ్రుల పేరుమీదున్న భూమి తమకు ఇవ్వడం లేదనే కోపంతో కన్న కూతురుతో పాటు అల్లుడు, మనువ డు గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని బూరుగడ్డ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిరుమామిళ్ల పుల్లారావు. పద్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారు ముగ్గురు కుమార్తెల వివాహం చేశారు. తమకున్న మూడు ఎకరాల 18 గుంటల పొలాన్ని ముగ్గురు కుమార్తెలకు ఎకరం చొప్పున పంచి ఇచ్చారు. 18 గుంటల భూమిని తమ పేరుమీదే ఉంచుకున్నారు. అయితే తమను సాదే బాధ్యతను చిన్న కుమార్తె, అల్లుడు తీసుకోగా వారికి సదరు భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. చిన్న కూతురు తన ఎకరం పొలంతో పాటు తల్లిదండ్రుల పేరున ఉన్న 18 గుంటల స్థలాన్ని సైతం కౌలుకు ఇచ్చింది. అయితే ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం పుల్లారావు–పద్మ దంపతుల బాగోగులు చిన్న కూతురు, అల్లుడు చూడకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. దాంతో తమ పేరుమీద ఉన్న 18 గుంటల భూమిని వదిలేయాలని కౌలు రైతుకు చెప్పడంతో పాటు ఆదివారం వృద్ధ దంపతులు పొలం వద్దకు వెళ్లి దున్నే పనిని అడ్డుకున్నారు. దాంతో వారి చిన్న కూతురు ఈడ్పుగంటి పావని, ఆమె భర్త రవి, వారి కొడుకు మోహన్ పొలం వద్దకు వెళ్లి వారిపై గొడ్డలి, కర్రలతో దాడి చేసి గాయపర్చారు. గమనించిన రైతులు 108కు సమాచారం అందించి వృద్ధ దంపతులను హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దామోదర్ రెడ్డి

నేరేడుచర్ల, ఆగస్టు 11 : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంట కండ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. నేరేడుచర్ల పట్టణంలో నిర్మించిన విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు హెల్త్ కార్డుల మంజూరు విషయమై చర్చించేందుకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహతో ప్రభుత్వ సబ్‌కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ ఇంక్రిమెంట్లు విడుదల చేయాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, 398 వారికి ప్రత్యేక ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇటీవల ప్రభుత్వానికి వినతిపత్రం అందించామని, అవి పరిష్కారమయ్యే వరకు సంఘం పోరాటం చేస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పది చోట్ల సంఘం భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. నేరేడుచర్లలో భవన నిర్మాణం కోసం స్థలాన్ని విరాళంగా ఇచ్చిన కొనతం కృష్ణారెడ్డి, సంధ్య దంపతులను అభినందించారు. సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ బచ్చల కూరి ప్రకాశ్, వైస్ చైర్మన్ అలక సరిత, వైస్ చైర్మన్ తాళ్ల సురేశ్‌రెడ్డి, పాలకవీడు మాజీ ఎంపీపీ భూక్య గోపాల్, సంఘం నేరేడుచర్ల అధ్యక్షుడు చింతకుంట్ల పూర్ణ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతుగంటి సత్యనారాయణ, సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సాగర్ కాల్వలో యువకుడి గల్లంతు

వెంకట్(ఫైల్)

నేరేడుచర్ల, (గరిడేపల్లి) ఆగస్టు11 : బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చిన యువకుడు సాగర్ ఎడమ కాల్వలో పడి గల్లంతైన ఘటన ఆదివారం గరిడేపల్లి మండలం వెలిదండలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలిందండ గ్రామానికి చెందిన కామల్ల మరియా కూతరు రాణి వివాహానికి హుజూర్‌నగర్‌కు చెందిన లక్షమల్ల వెంకట్(21) హాజరయ్యాడు. వేడుకల అనంతరం స్నానం కోసం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ వద్దకు వెళ్లాడు. కాల్వలో దిగుతుండగా కాలుజారి కాల్వలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వెంకట్ ఆచూకి కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. రాత్రి వరకు అతడి ఆచూకీ తెలియరాలేదు. వెంకట్ హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్లయ్య

నూతనకల్, ఆగస్టు 11 : రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పట్టా దారు పాస్ పుస్తకం ఆధారంగా అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. నీళ్లు, విద్యుత్ రంగాలపై ప్రభుత్వం సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి, సోనియాగాంధి వద్దకు పరుగులు తీస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పనులకే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ చూడి లింగారెడ్డి, నాయకులు గాడ్గుల లింగరాజు, బత్తుల విద్యాసాగర్, మొగళ్లు వెంకన్న, బత్తుల విజయ్‌కుమార్, మహేశ్వరం మల్లిఖార్జున్, ఇమ్మారెడ్డి రవి, మొరిగాల మహేశ్, ఉప్పుల వీరుయాదవ్, వీరమల్ల యాదగిరి, కోత్వాల మహేశ్ పాల్గొన్నారు.

సూర్యాపేటలో డప్పు చప్పుళ్లు, శివసత్తుల విన్యాసాలతో బోనాలు తీసుకొస్తున్న మహిళలు

బొడ్రాయి బజార్: ఊర ముత్యాలమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

గ్రామాల్లో బోనాల సందడి

సూర్యాపేట రూరల్, ఆగస్టు 11 : మండలంలోని కేటీ అన్నారం, రాయిన్‌గూడెం, టేకుమట్ల, ఎండ్లపల్లి, రామారం గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ముత్యాలమ్మ ఆలయం వద్దకు వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కేటీ అన్నారం గ్రామంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పబ్లిక్‌క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాయిన్‌గూడెం కౌన్సిలర్ ఎడ్ల గంగభావానీ వీరమల్లు, నాయకులు చిత్తలూరి కృష్ణ, భీమ్‌రెడ్డి, వీరయ్యగౌడ్, మధు, వెంకటేశం, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేటలో..

బొడ్రాయిబజార్ : సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం బోనాలను ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంలోని ఊర ముత్యాలమ్మ ఆలయం, మార్కెట్‌లోని కోట మైసమ్మ, తిరుమలనగర్‌లోని బేచిరాగ్ మాదారం ముత్యాలమ్మ ఆలయాల్లో బోనాల సందడి నెలకొంది. భక్తులు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం, సారె సమర్పించారు. ఊర ముత్యాలమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తగా దైవ దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ, మున్సిపల్, పోలీసు అధికారులు తగిన చర్యలు చేపట్టారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఊర ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు సారగండ్ల రాములు, 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న, బేచిరాగ్ మాదారం ఆలయ కమిటీ అధ్యక్షుడు మారం వెంకటరెడ్డి, నాయకులు రంగినేని ఉపేందర్, హనుమంతరావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, అధికారులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండలంలోని వల్లాపురం, రామాపురం గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మఠంపల్లిలో ముత్యాలమ్మ బోనాలు

మఠంపల్లి : మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు, యువత డప్పు చప్పుళ్లతో ప్రభ బళ్లు, బోనాలతో తరలివెళ్లి ముత్యాలమ్మకు నైవేద్యం సమర్పించారు. గ్రామ పెద్ద కాపు తాటికొండ లక్ష్మమ్మ ఇంటి నుంచి మొదటి బోనాన్ని తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పెద్దలు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మోతె : మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు, యువతులు, భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులు దీరారు. డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ముత్యాలమ్మ ఆలయానికి బోనాలను తీసుకెళ్లారు.

సూర్యాపేట రూరల్ : కేటీ అన్నారంలో పూజలు చేస్తున్న రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

తిరుమలగిరి : మండల కేంద్రంలో ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలివచ్చి గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించారు. తిరుమలగిరి(తుంగతుర్తి) : తుంగతుర్తి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఊర ముత్యాలమ్మకు ఆదివారం బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో తరలివెళ్లి ముత్యాలమ్మకు నైవేద్యం సమర్పించారు.

నాగారం మండలంలో..

నాగారం : మండల కేంద్రంతో పాటు వర్ధమానుకోట, నర్సింహులగూడెం, ఫణిగిరి, మామిడిపల్లి, పస్తాల, పసునూరు గ్రామాల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ముత్యాలమ్మ, మారమ్మ ఆలయాలకు తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను అలంకరించి గుడి చుట్టూ తిప్పి మొక్కులు చెల్లించుకున్నారు.

నూతనకల్ : మండలంలోని మాచనపలి, బిక్కుమళ్ల, చిల్కుంట్ల, నూతనకల్, లింగంపల్లి, తాళసింగారం గ్రామాల్లో ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

సూర్యాపేట : ముత్యాలమ్మకు నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

నాగారం : వర్ధమానుకోటలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

బొడ్రాయి బజార్ : బేచిరాగ్ మాదారం ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల సందడి

మఠంపల్లి :బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మోతె : బోనాలతో ముత్యాలమ్మ ఆలయానికి తరలి వెళ్తున్న మహిళలు

వైభవంగా నృసింహుడి కల్యాణం

స్వామివారిని గరుడవాహనంపై ఊరేగిస్తున్న అర్చకులు

మఠంపల్లి, ఆగస్టు 11 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం నృసింహుని నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణోత్సవం నిర్వహించిన అనంతరం ఆలయ పురవీధుల్లో గరుడ వాహనంపై స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిన మోదీ

- సీపీఐ జిల్లా నాయకుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, ఆగస్టు 11 : దేశాన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టిన ప్రధాని మోదీ వారికి అనుకూలంగా పాలన సాగిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన ఏఐవైఎఫ్ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడాబాబులు చేసిన రూ.16 లక్షల కోట్ల అప్పులను మోదీ రద్దు చేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. అసంఘటిత కార్మికుల హక్కులను కాపాడేందుకు, పని భద్రత కల్పించేందుకు పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, నాయకులు దోమకొండ సురేశ్, కర్నాటి నర్సిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు

పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి, ఆగస్టు 11 : మండలంలోని తిమ్మాపురంలో ఉన్న సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌర హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సౌర ఆరాధకుడు జనార్దన్ స్వామి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నేరేడుచర్ల, ఆగస్టు 11 : పాత నేరేడుచర్లలో తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి నగదు, నగలు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని పాత నేరేడుచర్లలో నివాసం ఉంటున్న నూకల జానకమ్మ ఈ నెల 10న ఇంటికి తాళం వేసి పెన్‌పహాడ్ మండలం నారాయణగూడెంలో బంధువుల ఇంటికి వెళ్లింది. రాత్రి దొంగలు ఇంటితాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా తాళాన్ని విరగొట్టి అందులో ఉన్న రూ. 50వేల నగదు, 8తులాల వెండి, రెండు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చిన జానకమ్మ దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్ఐ తెలిపారు.

ఎల్-27 లిఫ్టు ద్వారా నీటిని విడుదల చేయాలి

- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సురేశ్‌బాబు

నేరేడుచర్ల, ఆగస్టు 11 : సాగర్ ఎడమ కాల్వపై నిర్మించిన ఎల్–27 లిఫ్టును బాగు చేసి నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో అధికారులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సాగర్ నీటిని విడుదల చేసినప్పటికీ ఎల్–27 ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టక పోవడంతో నేరేడుచర్ల మండలంలోని బక్కయ్యగూడెం, మేడారం, గరిడేపల్లి మండలంలోని ఎర్రకుంట, గడ్డిపల్లి, మర్రికుంట, పెన్‌పహాడ్ మండలంలోని దూపాడు, లింగాల గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటలకు నీరందక ఎండి పోతున్నాయని తెలిపారు. బావులు, బోర్లతో భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లిఫ్టు మరమ్మతుల కోసం నిధులు కూడా విడుదల చేసిందని, అయినా మోటర్లు రిపేరులో ఉన్నాయని చెప్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రి జోక్యం చేసుకొని నీటిని విడుదల చేయించి రైతులను ఆదుకోవాలని కోరారు.

వెంకట్‌రెడ్డి మృతికి ఎమ్మెల్సీ సంతాపం

కోదాడ రూరల్, ఆగస్టు11: ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గడ్డం వెంకట్‌రెడ్డి మృతికి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం వెంకట్‌రెడ్డి మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంగ, నాయకులు ఆర్. ధన మూర్తి, నాగేశ్వర్‌రావు, సోమయ్య, బంగారయ్య, భిక్షపతిరావు, వీరబాబు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాగారం, ఆగస్టు 11 : మండలంలోని పేరబోయినగూడెం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఐలయ్య తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పేరబోయినగూడెం నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

- సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాశ్

సమావేశంలో మాట్లాడుతున్న అనంత ప్రకాశ్

పాలకవీడు, ఆగస్టు11: కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజలకిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ మాటలు కోటలు దాటుతున్నాయేగాని చేతలు గడపదాటడం లేదన్నారు. ఆరు గ్యారెంటీలు ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. 57 సంవత్సరాల లోపు మహిళలకు రూ. 2500, పింఛన్ పెంపు, ఇందిరమ్మ ఇండ్లు, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఎప్పుడు కల్పిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నరసింహ, మట్టేశ్, వెంకటయ్య, ధనమూర్తి, పురుశోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలి

- రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యుడు లక్ష్మణ్‌మాదిగ

చివ్వెంల, ఆగస్టు 11: ఈ నెల 13న హైదరాబాద్‌లో జరుగనున్న మాదిగ అమరవీరుల సంస్మరణ సభను విజయంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యుడు పల్లేటి లక్ష్మణ్‌మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని పేర్కొన్నారు. వారికి నివాళులర్పించేందుకు మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఆయన వెంట మండల నాయకులు చెరుకుపల్లి సుధాకర్, అశోక్, ఈశ్వర్, జశ్వంత్, గోపీచంద్ పాల్గొన్నారు.

పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి

- పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు రాజ్‌కుమార్

సభలో అభివాదం చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

బొడ్రాయిబజార్, ఆగస్టు 11 : రాష్ట్రంలో పద్మశాలీ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు వల్లికాటి రాజ్‌కుమార్ అన్నారు. ఈ నెల 18న జరుగనున్న పద్మశాలీ సంఘం ఎన్నికల్లో భాగంగా ఆదివారం స్థానిక పబ్లిక్‌క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లో సంఘం భవన నిర్మాణంతో పాటు ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 18న జరుగనున్న సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో రాజ్‌కుమార్ వర్గానికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు, వేముల వీరేశం, రాష్ట్ర మాజీ కార్యదర్శులు చలమల్ల నర్సిహ, ఎల్లె సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దూలం నగేశ్, ఉపాధ్యక్షులు శ్రీరాముల రాములు, పట్టణ అధ్యక్షుడు యలగందుల సుదర్శన్, జిల్లా నాయకులు ముశం నరసింహ పాల్గొన్నారు.

మిత్రుడికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

అర్వపల్లి, ఆగస్టు 11 : నాగారం మండలం డి. కొత్తపల్లి గ్రామానికి చెందిన వంపు లక్ష్మయ్య భార్య వసంత ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు(అర్వపల్లి విజ్ఞాన్ ఉన్నత పాఠశాల 1998–99 టెన్త్ బ్యాచ్)వాట్సాప్ గ్రూపు ద్వారా ఏకమై రూ.77వేలను పోగు చేశారు. వాటిని ఆదివారం డి.కొత్తపల్లి గ్రామానికి వెళ్లి లక్ష్మయ్యకు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.